
బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్
DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 148 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం 1-1-2025 వెల: 5/రూ -


## నయా సాల్ జోష్

- ప్రపంచవ్యాప్తంగా న్యూ ఇయర్ సంబరాలు
- ముందుగా కిరిబాటీ, చివరగా న్యూ సమోవా
- 2025కు వేడుకగా స్వాగతం పలికిన ప్రజలు



న్యూఢిల్లీ: ఆంగ్ల సంవత్సరాది సర్వత్రా నూతనోత్తేజం నింపింది. వేడుకలు, పార్టీలతో ఉత్సవ వాతావరణం నడుమ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. ఏ దేశంలో చూసినా ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాలన్నీ భారీ జనసందోహంతో కిటకిటలాడాయి. వాణిజ్య సముదాయాలు, హెటళ్లు తదితరాలు కళకళలాడాయి. ఎప్పట్లాగే క్రిస్మస్ ఐలాండ్‌గా పేరొందిన కిరిబాటీ రిపబ్లిక్ 2025ను స్వాగతించిన తొలి దేశంగా నిలిచింది. ఎంత ముందుగా అంటే, అమెరికా కాలమానం ప్రకారం డిసెంబర్ 31 ఉదయం ఐదింటికే అక్కడ నూతన సంవత్సర వేడుకలు మొదలైపోయాయి! తర్వాత పావు గంటకే పసిఫిక్ మహాసముద్రానికి దక్షిణాన ఉన్న చాదం ఐలాండ్స్‌లో, ఆ వెంటనే న్యూజిలాండ్‌లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నాయి.అర్ధరాత్రి క్యాలెండర్ మారి 2024 డిసెంబర్ 31 కాలగర్భంలో కలిసిపోతూనే న్యూజిలాండ్‌లోని ఆక్లండ్ నగరంలో సంబరాలు మిన్నంటాయి. తర్వాత ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలూ వేడుకల్లో పాలుపంచుకున్నాయి. ఆస్ట్రేలియాలోని చారిత్రక సిడ్నీ మార్బర్ బ్రిడ్జి బాణసంచా పేలుళ్లు, కళ్లు మిరుమిట్లుగొలిపే లేజర్ షోలతో పట్టపగలును తలపించింది. బ్రెజిల్‌లోని

- మిగతా 2వ పేజీలో

## తీర్పు ఇచ్చేదాకా అరెస్టు వద్దు

- హైకోర్టు ఆదేశం.. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు
- హెచ్ఎండీఏ నిధులను రేస్‌లకు వినియోగించవచ్చా?
- దర్యాప్తు ఏ దశలో ఉంది? ఇప్పటివరకు ఏం చేశారు?
- ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీకి ధర్మాసనం ప్రశ్నలు
- ఆర్థికశాఖ అనుమతి.. క్యాబినెట్ ఆమోదం లేదు
- ఒప్పందానికి ముందు చెల్లింపులు ఎలా చేస్తారు?
- గంపగుత్తగా నిబంధనలు ఉల్లంఘన: ఏసీబీ, ప్రభుత్వం
- ఉల్లంఘనే నేరం జరిగినట్లు కాదు: కేటీఆర్ న్యాయవాదులు



హైదరాబాద్,: ఫార్ములా ఈ-రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో తీర్పు వెలువరించే వరకు ఆయనను అరెస్ట్ చేయరాదని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. ఏసీబీ దర్యాప్తును మాత్రం యథావిధిగా చేసుకోవచ్చని

- మిగతా 2వ పేజీలో



## జలహారతికి ప్రపంచ బ్యాంకు దన్ను


- ఆ బ్యాంకు మిగులు నిధులపై చంద్రబాబు దృష్టి!
- వివిధ ప్రాజెక్టులకు ఖర్చు చేయగా మిగిలే మొత్తాన్ని తీసుకునే యోచన
- ఇప్పటికే ప్రధాని మోదీ,కేంద్ర ఆర్థిక మంత్రితో సీఎం చర్చలు
- ప్రస్తుతం 51,364 కోట్ల మిగులు
- ఇందులో 40 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత!
- మిగతా 40 వేల కోట్లు కాంట్రాక్టు సంస్థల నుంచి సమీకరణ

2లో

## సంక్రాంతికు భరోసా!

- 6 వేలు కాదు.. 10 వేలు
- అన్నదాతలకు మోదీ కొత్త సంవత్సర కానుక
- కిసాన్ నిధి కింద ఏటా ఇస్తున్న మొత్తం పెంపు
- వచ్చే బడ్జెట్‌లో వెల్లడించకముందే ప్రధాని ప్రకటన
- ఏడాదికి ఇస్తున్న రూ.6 వేలను పెంచిన కేంద్రం

2లో





## 4న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం


- రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా
- తదితర కీలక అంశాలపై చర్చ
- బీసీ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ,
- యాదగిరిగుట్ట ఆలయ బోర్డుపైనా..

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 4న జరగనుంది. డిసెంబరు 30న నిర్వహించాలని ముందు నిర్ణయించినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో వాయిదా వేశారు. 4న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా

- మిగతా 2వ పేజీలో

## ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్!

- ప్రజాప్రతినిధులకు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్
- కోటా ప్రకారం వారే నేరుగా బుక్ చేసుకొనేఅవకాశం



తిరుమలకు వచ్చే భక్తులకు శ్రీవారి దర్శనం సులభతరంగా, సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సామాన్య భక్తుల దర్శన నిరీక్షణ సమయాన్ని తగ్గించడంపై కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులే నేరుగా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసుకునేలా ఆలోచన చేస్తున్నారు. నిత్యం దాదాపు 60-70వేల మంది భక్తులు శ్రీవారిని

- మిగతా 2వ పేజీలో

## మణిపూర్ సీఎం క్షమాపణ

### హింసలో 200 మందికిపైగా మరణించారు

### కొత్త ఏడాదిలోనైనా శాంతి నెలకొనాలి: బీరేన్ సింగ్

ఇంఫాల్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: జాతుల వైరం సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంపై మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. మైతేయి, కుకీ తెగల మధ్య ఘర్షణతో 2023 మే నుంచి ఆ రాష్ట్రంలో హింస కొనసాగుతోంది. 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది ఇళ్లను వీడిపోయారు. ఇప్పటికీ అనేకమంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. దీనిపై మంగళవారం మీడియా ఎదుట విచారం



2లో

## కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

- తొలిదశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణం
- గచ్చిబౌలిలో మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



2లో

# జలహారతికి ప్రపంచ బ్యాంకు దన్ను

అమరావతి: గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ వరకు తరలించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు 'తెలుగుతల్లికి జలహారతి'. దీనిపై సీఎం చంద్రబాబు సోమవారం మీడియా సమావేశంలో సవివర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇతర రాష్ట్రాలతో లింకు పెట్టుకోకుండా.. నదుల అనుసంధానం కింద కాకుండా.. రాష్ట్ర అంతర్గత అనుసంధానం ప్రాజెక్టుగా దీనిని ఆయన ప్రతిపాదిస్తున్నారు. నదుల అనుసంధానం అంటే పొరుగు రాష్ట్రాల అనుమతులు కూడా కావాలి. అంతర్గత అనుసంధానానికి ఆ అవసరం లేదు. అందుబాటులో ఉన్న మిగులు జలాలను కరువు సీమకు మళ్లించడంవరకే ఇది పరిమితం. దీనిపై ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన చర్చించారు. ప్రాజెక్టు డాక్యుమెంటును తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపించారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)ను త్వరలో పంపనున్నారు. ఇంకోవైపు.. నిధుల సాధనపై కూడా ఇప్పటి నుంచే దృష్టి పెట్టారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న ప్రపంచ బ్యాంకు మిగులు నిధులను ఈ ప్రాజెక్టుకు సాధించడానికి ఆయన పూనుకున్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం కేంద్రం ప్రపంచ బ్యాంకు నుంచి సమీకరించిన నిధుల్లో ఖర్చు కాకుండా మిగిలిపోయిన మొత్తం సుమారు ఆరు బిలియన్ డాలర్లు ఉన్నట్లు అంచనా. రూపాయల్లో ఈ మొత్తం 51,364 కోట్ల వరకూ ఉంటుంది. ఏదైనా ప్రాజెక్టు కోసం సేకరించిన రుణంలో ఖర్చుకాకుండా మిగిలే నిధులను మరో ప్రాజెక్టుకు వినియోగించుకోవడానికి ప్రపంచ బ్యాంకు నిబంధనలు అనుమతిస్తున్నాయి. ఈ పద్దు కింద ఉన్న నిధులను గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కోసం సాధించే యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఆయన ఇప్పటికే దీనిపై ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రితో సంప్రదింపులు జరిపారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్వరూపం ఎలా మారుస్తుందో.. రాష్ట్రానికి ఎంత ఉపయోగకరమో వారికి వివరించారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.40 వేల కోట్ల వరకూ కేటాయించడానికి కేంద్రం సుముఖంగా ఉంది. ప్రపంచ బ్యాంకు మిగులు నిధుల నుంచే ఈ మొత్తం ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విషయంలో ప్రపంచ బ్యాంకు వర్గాలు కూడా సానుకూల దృక్పథంతో ఉన్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు సర్కారు ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేస్తుందని, మంచి ఆలోచనలతో ముందుకు వస్తుందని ఆ వర్గాలు భావిస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్రం నుంచి కొంత సానుకూలత వ్యక్తమైన తర్వాతే ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టు వివరాలను బహిర్గతం చేశారు. ప్రస్తుతం దీని సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన జరుగుతోంది. 3 నెలల్లో సిద్ధంచేసి కేంద్రానికి పంపి.. అనుమతి వచ్చిన 2-3 నెలల్లో టెండర్లు పిలుస్తామని సీఎం చెప్పారు. కేంద్రంతో సత్సంబంధాలు సాగిస్తున్న ఆయన.. కేంద్రం నుంచి నిధులు సాధించి తెస్తారన్న గట్టి నమ్మకంతో అధికార వర్గాలు ఉన్నాయి.దకేంద్రం 40 వేల కోట్లు ఇవ్వగా.. ఇంకా మరో రూ.40 వేల కోట్లు జలహారతి ప్రాజెక్టుకు సమీకరించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల పనులు చేపట్టే భారీ కాంట్రాక్టు సంస్థల నుంచి ఈ నిధులు సేకరించి వాటికి పాతికేళ్లపాటు ఏటా కొంత మొత్తం చెల్లించే నమూనా అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రాథమికంగా అనుకుంటోంది. ఒక పెద్ద కాంట్రాక్టు కంపెనీ ఇప్పటికే కొంత ఆసక్తి చూపి అధ్యయనం చేస్తోంది. ఒక సంస్థ వల్ల కాకపోతే రెండు, మూడు ఏజెన్సీలను కలిపి కన్సార్షియంగా ఏర్పాటు చేసి నిధులు సమీకరించాలని సీఎం అనుకుంటున్నారు. జలహారతి ప్రాజెక్టు తొలిదశలో పోలవరం కుడి కాలువ నుంచి గోదావరి జలాలను విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీలోకి తరలించాలని.. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువకు తీసుకెళ్లి కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయరును నింపాలని తొలుత అనుకున్నారు.

# నయా సాల్ జోష్

(మొదటి పేజీ తరువాయి)

రియోడిజనిరో నగరంలో న్యూ ఇయర్ సంబరాలు మిన్నంటాయి. కోపాచబానా బీచ్ ఏకంగా 12 నిమిషాల పాటు బాణసంచా వెలుగుల్లో తళుకులీనింది. అక్కడి వేడుకల్లో ఏకంగా 20 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌లో వందేళ్ల సంప్రదాయం ప్రకారం బాల్ డ్రాప్ వేడుక జరగనుంది. జోనాస్ బ్రదర్స్, సోఫీ ఎలిస్%-%బెక్స్టర్, రీటా ఓరా తదితరులు సంగీత ప్రదర్శనలతో అలరించనున్నారు. అమెరికాలోని ఇతర నగరాలూ సంబరాలకు సిద్ధమయ్యాయి. అమెరికన్ సమోవా ప్రజలు ఎప్పట్లాగే అందరికన్నా ఆలస్యంగా న్యూ ఇయర్‌కు స్వాగతం చెప్పనున్నారు. న్యూజిలాండ్‌తో పోలిస్తే ఏకంగా 24 గంటల తర్వాత అక్కడ తేదీ మారుతుంది! యుద్ధాలు, సంక్షోభాలతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌తో పాటు పలు పశ్చిమాసియా దేశాల్లో మాత్రం న్యూ ఇయర్ సందడికి బదులు ఎప్పట్లా శ్మశాన నిశ్శబ్దమే తాండవించింది.

**భారత్‌లో సందడి**

భారత్‌లో దేశవ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు దుమ్మురేపాయి. రాజధాని ఢిల్లీ మొదలుకుని అన్ని ప్రధాన నగరాల్లోనూ పలు కార్యక్రమాలు కన్నులపండువగా జరిగాయి. ప్రజలంతా ఇళ్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించుకున్నారు. వేడుకగా కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. ఢిల్లీలోని ఇండియా గేట్, కోల్‌కతాలో విక్టోరియా మెమోరియల్, ముంబైలో గేట్‌వే ఆఫ్ ఇండియా, చెన్నై మెరినా బీచ్, బెంగళూరు బ్రిగేడ్ రోడ్ తదితర చోట్ల జనం ఇసుక వేసినా రాలనంతగా కన్పించారు. ఇక గోవాలోనైతే కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఏ నగరంలో చూసినా క్లబ్బులు, పబ్బులు, హొటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, పార్కులు తదితరాలన్నీ కిటకిటలాడాయి. అవాంఛనీయ ఘటనలను నివారించేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మందుబాబులకు ముకుతాడు వేసేందుకు అన్ని నగరాల్లోనూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నింటికీ తాకిడి విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంతటి హిమపాతంతో తడిసి ముద్దవుతున్న ఉత్తరాఖండ్, కశ్మీర్ తదితర చోట్లకు జనం పోటెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హర్షిల్, దయారా, సంక్రి వంటి మారుమూల ప్రాంతాలకు కూడా దేశం నలుమూలల నుంచీ పర్యాటకులు విరగబడ్డారు. చుట్టూ మంచు నడుమ టెంట్లు, క్యాంపుల్లో బస చేశారు. అర్ధరాత్రి కాగానే న్యూ ఇయర్ సంబరాల్లో మునిగిపోయారు. అక్కడి హొటళ్లు, దాబాలు అత్యంత వినూత్నంగా నూతన సంవత్సర వేడుకలు జరిపి ఆకట్టుకున్నాయి. కుంభమేళా నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమంలో కొలువుదీరిన కుంభనగరిలో కూడా న్యూ ఇయర్ వేడుకలు అలరించాయి.

# కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

హైదరాబాద్: ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో పునర్ వ్యవస్థీకరణ చేయనున్నట్లు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆధునిక హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించబోతున్నట్లు చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్ వ్యవస్థీకరణ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలను నిర్మించాలని, ఇందుకు అవసరమైన భూములను గుర్తించాలని రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా 37 మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయని, మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేలా కార్పొరేట్ స్థాయిలో నూతన కార్యాల యాల నిర్మాణం చేపడతామన్నారు. తొలి దశలో సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్‌లో, రంగారెడ్డి జిల్లాకు సంబంధించి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే, గండిపేట, శేరిలింగంపల్లి కార్యాలయాలతో పాటు, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) వద్ద మోడల్ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మించనున్నట్లు చెప్పారు. జనవరిలోనే దీనికి శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు షేక్‌పేట ప్రాంతంలో ఒకే చోట నిర్మించాలని నిర్ణయించామన్నారు. తొలిదశలో నిర్మించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఒకొక్కటి కనీసం మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయన్నారు. పది నుంచి 15 వేల చదరపు అడుగుల్లో భవన నిర్మాణం చేపడతామని చెప్పారు. డిమాండ్ ఎక్కువ ఉండే ప్రాంతాల్లో కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలించేందుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి కూడా పాల్గొన్నారు.

# 4న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల సహాయం, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు వంటి అంశాలపై చర్చించనున్నారని సమాచారం. రాష్ట్రంలో కొత్త తెల్ల రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ప్రజల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. కార్డుల జారీకి నిబంధనలపై చర్చించి, ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రైతు భరోసాపై ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీ పలుమార్లు చర్చించింది. దీనిపై క్యాబినెట్‌లోనూ చర్చించనున్నారు. ఎంత భూ విస్తీర్ణానికి రైతు భరోసాను పరిమితం చేయాలి? లబ్ధిదారుల గుర్తింపు ఎలా? వంటి అంశాలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రైతు కూలీలకు ఏటా రూ.12 వేలను చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీపై కూడా చర్చించి, ఓ నిర్ణయానికి రానున్నట్లు సమాచారం. యాదగిరి గుట్టను టీటీడీ తరహాలో తీర్చిదిద్దాలని భావిస్తున్న ప్రభుత్వం..

# సంక్రాంతికు భరోసా!

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశవ్యాప్తంగా రైతులు, పేదలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర కానుకలు ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సర్వే చేయాలని నిర్ణయించారు. 2019 నుంచి మోదీ సర్కారు ఏటా రైతులకు రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తోంది. రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అన్నదాతల ఖాతాల్లో సొమ్మును జమ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచుతున్నట్లు మోదీ 'ఎక్స్'లో తెలిపారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారి ఖాతాల్లో నేరుగా రూ.10 వేలు జమ చేయనున్నట్లు ప్రకటించారు. కిసాన్ నిధిని పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని.. ఆర్థిక మంత్రి నిర్మల త్వరలో ప్రవేశపెట్టే 2025-26 బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు ఇదివరకే పేర్కొన్నాయి. అయితే దానికి ముందే ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు మంగళవారం ప్రధాని స్వయంగా వెల్లడించడం గమనార్హం. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాలు చెల్లించింది. కొత్త ఏడాది ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సాహాలు రేపింది.

దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్లను నిర్మించే విషయంపై సర్వే జరిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని మోదీ తరఫున నూతన సంవత్సర కానుకగా ఈ నిర్ణయం తీసుకుంది. 2025 మార్చి 31లోపు ఈ సర్వేను పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాధాన్య ప్రాతిపదికన ఈ సర్వేను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ డిసెంబరు 27న కేంద్రం అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది. 'ఆవాస్ 2024' పేరిట రూపొందించిన యాప్‌లో ప్రజలు స్వయంగా సర్వేలో పాల్గొనేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. గత సెప్టెంబరులోప్రధాని మోదీ ఈ యాప్‌ను ప్రారంభించారు. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ద్వారా ప్రజలు సర్వేలో పాల్గొనే అవకాశం కల్పించారు. కాగా పేదలకు మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తామని బీజేపీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. అయితే రాబోయే నాలుగేళ్లలో అదనంగా 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంగళవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. మొత్తం 3.33 కోట్ల ఇళ్లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించగా, అందులో 3.22 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయని.. 2.68 కోట్ల ఇళ్లు నిర్మించారని తెలిపింది. పీఎంఏవై గ్రామీణ లబ్ధిదారులను గుర్తించేందుకు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఫేస్ టెక్నాలజీని రూపొందించామని, దీనివల్ల మోసాలకు అవకాశం ఉండదని వెల్లడించింది.దఆకాంక్షల భారతావనికి ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. "అంతరిక్షం నుంచి భూమి వరకు.. రైల్వేస్ నుంచి రన్‌వేస్ దాకా.. సంస్కృతి నుంచి ఆవిష్కరణ వరకు.. 2024లో భారత్ గణనీయ పురోగతిని, పరివర్తనను సాధించింది. ప్రగతి దిశగా నా భారత్ వడివడిగా అడుగులేస్తోంది. మేరా భారత్ బఢ్ రహా" అని 'ఎక్స్'లో తెలిపారు. 2025లోకి విశ్వాసంతో అడుగుపెడుతున్న తరుణంలో తన ట్వీట్‌ను కవితా వేడుకగా అభివర్ణించారు. 2024లో భారత విజయాలను, చేరుకున్న మైలురాళ్లను వివరించే 2.41 నిమిషాల వీడియోను ఈ సందర్భంగా ఆయన పోస్టు చేశారు. ఇందులో అంతరిక్ష ప్రయోగాల విజయాలు, సూపర్-కంప్యూటింగ్, రక్షణ ఉత్పత్తుల పెంపు, పౌరవిమానయాన పరిశ్రమ వృద్ధి, హౌరా మైదాన్ అండర్‌వాటర్ మెట్రో, రామేశ్వరం రైలు వంతెన, వందే భారత్ రైళ్లు, దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల పెంపు, ఆరోగ్య సౌకర్యాల మెరుగుదల, అటల్ పెన్షన్ స్కీం, పీఎం ఆవాస్ యోజన, అబుదాబిలో దేవాలయ ప్రతిష్ఠ, మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలు మొదలైనవాటి ప్రస్తావన ఉంది. 2024లో తన ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 70 వేల కోట్ల డాలర్లకు చేరుకోవడం సహా ఆర్థిక రంగానికి సంబంధించిన ప్రత్యేక సమాచారాన్ని కూడా అందులో పొందుపరిచారు. ఆసియాలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్ ఆవిర్భవించడం.. ఉపాధి కల్పన రంగంలో 4.1 కోట్ల మంది యువతకు రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ అందించడం, క్రీడల రంగంలో.. పారా-ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించడం.. పర్యావరణహితం కోరి 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం (ఏక్ పేడ్ మా కే నామ్)' అన్న సందేశం.. గ్రీన్ పవర్ ఉత్పత్తి సామర్థ్యం మొదలైనవాటిని కూడా వివరించారు. సమష్టి కృషితో 2024లో అనేక విజయాలు అందుకున్నామన్నారు. 2025లో మరింత కష్టించి 'వికసిత్ భారత్' కలను సాకారం చేసుకుందామని తెలిపారు. కొత్త సంవత్సరం అందరికీ పురోగతి, శాంతి, ఆరోగ్యం అందిస్తుందన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తంచేశారు.

# ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్!

(మొదటి పేజీ తరువాయి)



దర్శించుకుంటున్నారు. వారాంతాలు, విశేష పర్వదినాల్లో ఈ సంఖ్యలక్షకు చేరుతోంది. అయితే స్వామి దర్శనానికి వచ్చేవారిలో సగానిపైగా బ్రేక్ దర్శనాల కోసమే ఆరాటపడుతున్నారు. నిత్యం ఎవరో ఒక ప్రజాప్రతినిధి సిఫారసు లేఖతో వచ్చి తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయం అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి రోజుకు రెండు, మూడు లేఖలు కూడా వస్తున్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేలా టీటీడీ నూతన ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసి టీటీడీ బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులకే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. కోటాకు తగినట్టు వారే ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసి భక్తులకు అందజేసేవారు. ఇదే పద్ధతిని ప్రజాప్రతినిధులకూ అమలుచేయడంపై అధికారులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ నేతల సిఫారసు లేఖలపై కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నూతన విధానం అమలులోకి తెస్తే ఆయా ప్రజాప్రతినిధులే తమ కోటాకు తగినట్టు ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ టికెట్లు బుక్ చేసుకుంటారని భావిస్తున్నారు. ఇందులో ఉన్న సమస్యలపైనా అధికారులు దృష్టి సారించారు. ఈ విధానంలో నేతలు వంద శాతం కోటాను వినియోగించుకుంటారు. ఈ క్రమంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన విధంగా మార్పుచేర్పులు చేయాలని టీటీడీ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది.

# మణిపూర్ సీఎం క్షమాపణ

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేసిన బీరేన్ సింగ్ ప్రజలను క్షమాపణ కోరారు. 'ఈ ఏడాదంతా చాలా దురదృష్టకర పరిణామాలతోనే కొనసాగింది. గతేడాది మే 3 నుంచి ఇప్పటి వరకు జరిగినదానికి క్షమించమని రాష్ట్ర ప్రజలను కోరుతున్నా. నూతన సంవత్సరం-2025 రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరిస్తుందని ఆశాభావంతో ఉన్నా. జరిగిందేదో జరిగిపోయింది. గత తప్పులను మరచిపోయి ఇప్పుడు మనమంతా కొత్త జీవితాన్ని ప్రారంభించాలి. శాంతియుత మణిపూర్, సుసంపన్న మణిపూర్ కోసం మనమంతా కలిసి జీవించాలని రాష్ట్రంలోని అన్ని కులాలను కోరుతున్నా' అన్నారు.

# తీర్పు ఇచ్చేదాకా అరెస్టు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. అయితే విచారణలో భాగంగా ఇటు కేటీఆర్‌కు, అటు ఏసీబీకి ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది. హెచ్ఎండీఏ నిధులను ఇలాంటి రేసింగ్‌ల కోసం వినియోగించవచ్చా? ఏ నిబంధనల ప్రకారం ఈ -రేసింగ్‌కు ఖర్చు చేశారు? అని ప్రశ్నించింది. మిగతా ఇద్దరు నిందితులు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారా? దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? ఇప్పటివరకు ఏంచేశారు? అని ఆరా ?తీసింది. దర్యాప్తుపై తాము స్టే ఇవ్వలేదని గుర్తు చేసింది. విదేశీ సంస్థ అయిన ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు అక్రమంగా రూ.54 కోట్లు చెల్లించారంటూ మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ చేసిన ఫిర్యాదుతో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ దవే, గండ్ర మోహన్‌రావు, ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. "ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు లేదు. ఎలాంటి నేరం లేకుండానే రాజకీయ కుట్రతో కేసు నమోదు చేశారు. నిధులు సొంతానికి వాడుకున్నట్లు, దుర్వినియోగం చేసినట్లు, నా వాళ్లకు లబ్ధి కలిగేలా వ్యవహరించినట్లు ఎక్కడా నిరూపించలేకపోయారు. చట్టబద్ధమైన ఒప్పందం మేరకు బ్యాంకు ద్వారా జరిగిన లావాదేవీ ఇది" అని కేటీఆర్ పేర్కొన్న అభిప్రాయాలను ఆయన తరఫు న్యాయవాదులు వివరించారు.


ఉల్లంఘనలు జరిగి ఉండొచ్చని, కానీ.. నేరం జరగలేదని కేటీఆర్ న్యాయవాదులు తెలిపారు. ""ప్రతి ఉల్లంఘనకు క్రిమినాలిటీని అంటగట్టలేం. నా అధీనంలో ఉన్న ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ ఎక్కడా లేదు. అప్పటి మునిసిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ రూపొందించిన ఫైల్‌కు నేను ఆమోదం తెలిపాను. అంతే తప్ప నేను ఏ ఒప్పందంపైనా సంతకాలు చేయలేదు. రెగ్యులేటరీల అనుమతి పొందాల్సిన బాధ్యత నాది కాదు. కేవలం నాపై ఈ కేసు పెట్టాలనే దురుద్దేశంతోనే గత ప్రభుత్వ వాయిదాలు ఎగవేసి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. 'మహ్మద్ వాజిద్ ' కేసులో దురుద్దేశంతో పెట్టే కేసులను కొట్టేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. దురుద్దేశం అనే ఒక్క కారణంతో ఈ కేసును కొట్టేవచ్చు. 'సతీశ్ శర్మ' కేసులో కేవలం అప్రూవల్ ఇచ్చినంత మాత్రాన మంత్రిని బాధ్యులను చేయలేమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# సూడాన్ శిశువుకు పునర్జన్మ

### తొలుత కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స

**డబ్బులు అయిపోవడంతో దంపతులను నిలోఫర్‌కు పంపించిన ఆస్పత్రి వర్గాలు**

**చిన్నారికి ఉచిత చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన నిలోఫర్ వైద్యులు**



హైదరాబాద్/ నాంపల్లి: సూడాన్ దేశానికి చెందిన ఓ శిశువుకు హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. అత్యంత విషమ పరిస్థితుల్లో ఉన్న శిశువుకు సుమారు నెల రోజులపాటు నిలోఫర్‌లో పూర్తి ఉచితంగా వైద్యం అందించారు. సూడాన్ దేశానికి చెందిన దంపతులు ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కనేందుకు ఏడాది క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో సయీదా అబ్దుల్ వాహెద్ అనే మహిళ ఐవీఎఫ్ చేయించుకుని నెలరోజుల క్రితం మగ పిల్లాడికి జన్మనిచ్చి0ది. శిశువుకు పుట్టుకతోనే బ్లడ్ ఇన్ఫెక్షన్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల్లో సమస్య ఉన్నట్టుగా గుర్తించారు. శిశువు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆరు రోజులపాటు కార్పొరేట్ ఆసుపత్రి ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఈ క్రమంలో సూడాన్ దంపతుల వద్ద డబ్బులు పూర్తిగా అయిపోవడంతో శిశువును నిలోఫర్‌కు రిఫర్ చేశారు. ఆ శిశువును అడ్మిట్ చేసుకున్న నిలోఫర్ డాక్టర్లు నెల రోజులపాటు పూర్తి ఉచితంగా చికిత్స అందించారు. శిశువు తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. శిశువు పూర్తిగా కోలుకోవడంతో, మంగళవారం డిశ్చార్జ్ చేశామని చికిత్స చేసిన నియోనాటాలజిస్ట్ డాక్టర్ స్వప్న తెలిపారు. తన బిడ్డను బతికించిన డాక్టర్లకు ఆ తల్లి (43 ఏళ్లు) కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇప్పటికే ఐదుసార్లు అబార్షన్ అయిందని, ఎన్నో ఏళ్లుగా పిల్లల కోసం తపించామని ఆమె తెలిపారు. చావుబతుకుల్లో ఉన్న తన బిడ్డకు నిలోఫర్ వైద్యులు పునర్జన్మను ప్రసాదించారన్నారు. విషమ పరిస్థితిలో ఉన్న శిశువుకు ట్రీట్‌మెంట్ అందించిన డాక్టర్ల బృందాన్ని, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అభినందించారు.

## భగీరథమ్మ చెరువులో ఆక్రమణల కూల్చివేత

### ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా

**హైదరాబాద్:** హైదరాబాద్ ఖాజాగూడ భగీరథమ్మ చెరువులోని అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. బఫర్ జోన్ లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కుల్చివేస్తున్నారు ఖాజాగూడా భగీరథమ్మ చెరువు ఆక్రమమణలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఇటీవలే భగీరథమ్మ చెరువులోని ఆక్రమణలను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. ఈ క్రమంలో డిసెంబర్ 31న బఫర్ జోన్ లో ఏర్పాటు చేసిన షెడ్ లు,ఆక్రమణలను కూల్చివేసింది.నాలుగు ఎకరాల్లో ఆక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారు. 20కి పైగా దుకాణాలను తొలగించారు. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే దుకాణా లను ఎలా ఖాళీ చేయాలంటూ వ్యాపారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగిస్తోంది.

## అడ్డగోలు హామీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

**రైతులను రాబందుల్లా దోపిడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

**హైదరాబాద్:** అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని వర్గాలను నట్టేట ముంచుతుందని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయకపోగా కాంగ్రెస్ రాబందులు ఉల్టా రైతులనే దోపిడీ చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. జోగులాంబ జిల్లా ఐజ మండలంలో ఆర్డీఎస్ కెనాల్ కింద పండించిన వరి ధాన్యాన్ని గవర్నమెంట్ ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. చాలా చోట్ల మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్ల అకౌంట్‌ను తమ గుప్పిట్లో పెట్టుకొని ఇదే అదనుగా ఐకేపీ సెంటర్ల దగ్గర కాంగ్రెస్ నాయకులు రైతులను పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు. క్వింటాల్‌కు నాలుగు కిలోల చొప్పున తక్కువ తూకం వేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఒక ఎకరం 30 క్వింటాలు దిగుబడి వస్తుంది.. కావున క్వింటాల్‌కి నాలుగు కిలోల చొప్పున తీసివేస్తే ఒక ఎకరం మీద రైతు రూ. 3500లు నష్టపోతున్నారు. మళ్లీ హమాలీ పేరిట క్వింటాల్ చొప్పున రూ. 46 వసూలు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారం సగటున ఒక ఎకరానికి ఐకేపీ సెంటర్ల ద్వారా గవర్నమెంట్‌కి విక్రయిస్తే రూ. 4880లు రైతులు నష్టపోతున్నామని ఇక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. కేసీఆర్ గవర్నమెంట్‌లో ఎకరాకు పెట్టుబడి సహాయంగా రూ. 5000 అందజేస్తే రేవంత్ రెడ్డి గవర్నమెంట్‌లో ఉల్టా ఎకరాకు రూ. 4880 నష్టపోతున్నారు.

# ఇందిరమ్మ ఇంటికి ఇసుక ఉచితం!

**రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త! రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు కొత్త సంవత్సర కానుక ఇవ్వనుంది.**

**ఒక్కో ఇంటికి 37-40 టన్నులు అవసరం.. పూర్తి ఉచితంగా ఇవ్వాలని సర్కారు యోచన?**

**4.50 లక్షల ఇళ్లకు 112 లక్షల క్యూబిక్ మీటర్ల..ఇసుక కావాల్సి ఉంటుందని అంచనా**

**ఒక్కో ఇంటికి అదనంగా రూ.60 వేలు వెచ్చించనున్న ప్రభుత్వం!**

హైదరాబాద్: రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త! రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు కొత్త సంవత్సర కానుక ఇవ్వనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు పొందిన లబ్ధిదారులకు సిమెంటు, ఇనుమును సంబంధిత కంపెనీలతో మాట్లాడి, తక్కువ ధరకే అందించాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం.. తాజాగా ఇసుకను ఉచితంగా అందించాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. వాస్తవానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించినప్పుడు కేవలం సొంత స్థలం ఉన్నవారు ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు, స్థలం లేని వారికి స్థలమిచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని మాత్రమే చెప్పింది. కానీ, ప్రస్తుత పరిస్థితులు, ఇంటి నిర్మాణంలో కీలకమైన ఇసుక, ఇనుము, సిమెంటు ధరలు మార్కెట్‌లో చుక్కలనంటుతున్న నేపథ్యంలో సిమెంటు, ఇనుమును తక్కువ ధరకు అందించాలనే యోచనకు వచ్చింది. ఇసుకను మాత్రం పూర్తిగా ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒక్కో ఇంటికి ఎంత మేర ఇసుక అవసరమనే అంశాన్ని చెబుతూ గృహ నిర్మాణ సంస్థ పంపిన ప్రతిపాద నలపై ప్రభుత్వం అంచనాలు వేస్తోంది. ఈ మేరకు ఒక్కో ఇంటికి 25 క్యూబిక్ మీటర్ల ఇసుక (దాదాపు 37-40 టన్నులు) అవసరం అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసే మొత్తం 4.50 లక్షల ఇళ్లకు 112 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అధికారులు ప్రభుత్వానికి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమయ్యే ఇసుకను ఉచితంగా అందించే అంశంపై ప్రభుత్వం ఖనిజాభివృద్ధి సంస్థతో చర్చించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో ఇసుక లభ్యమవుతోంది? ఎంత ధర ఉంది? అనే వివరాలను సేకరిస్తోంది.కాగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో టన్ను ఇసుక ధర రూ.1400-1500 వరకు పలుకుతోంది. ఇందులోనూ రకాలున్నాయి. ఈ ధరలు ప్రాంతాలు, డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. ఉదాహరణకు ఖమ్మంలో టన్ను ఇసుక ధర రూ.1400 పలికితే.. అదే హైదరాబాద్‌లో రూ.1600-1700 వరకు పలుకుతోంది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పుడు ఇదే ఇసుకను టన్ను రూ.2200-2400 వరకు కూడా విక్రయించామని ఒక ఇసుక వ్యాపారి 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఒక్కో ఇంటికి దాదాపు 37-40 టన్నుల ఇసుక



అవసరమవుతుంది. దీని ప్రకారం టన్ను ధర సగటున రూ.1500 అనుకుంటే.. ఒక్కో ఇంటికి ప్రభుత్వం అదనంగా రూ.60 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెంలో రెండు ర్యాంపుల్లో, ములుగు జిల్లాలో ఒకట్రెండు, కాళేశ్వరం దగ్గర ఉన్న ర్యాంపుల్లో ఇసుక అందుబాటులో ఉంది.

**అక్రమాలకు తావు లేకుండా..**

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా అందించాలని భావిస్తున్న ఇసుక విషయంలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలనే యోచనలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు అప్పటి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందించింది. అయితే, డబుల్ ఇళ్ల పేరుతో ఇసుకను బ్లాక్‌లో విక్రయించడంతో పాటు ఇతర అవసరాలకు వినియోగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈసారి అలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇసుకను ఉచితంగా అందించాలనే నిర్ణయం నేపథ్యంలో రవాణా చార్జీలను కూడా ప్రభుత్వమే భరించాలా, లబ్ధిదారుడికి కొంత వాటాను చెల్లించే నిబంధన పెట్టాలా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

## సైబర్ మోసం తాళలేక విద్యార్థి ఆత్మహత్య

**తల్లి ఖాతాలోంచి రూ. 90 వేలు తీసుకొని ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేసిన వైనం**

**పెట్టిన సొమ్ము తిరిగిచ్చేందుకు రూ. 2 లక్షలకుపైగా అడగడంతో మనస్తాపం**

**సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య.. కరీంనగర్ జిల్లాలో విషాదం**



వీణవంక (హుజూరాబాద్): సైబర్ మోసానికి ఓ విద్యార్థి బలైపోయాడు. రూ. 5 వేలు పెట్టుబడి పెడి తే రెండింతలు ఇస్తాం' అంటూ ఫోన్‌కు వచ్చిన మె సేజ్‌కు ఆకర్షితుడై పలు దఫాలుగా కేటుగాళ్లకు రూ.90 వేల మేర ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడు. చివరకు మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగ ల్ గ్రామంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

**మహిళా సంఘం నుంచి తల్లి తీసుకున్న చిట్టీ డబ్బులతో..** బేతిగల్ గ్రామంలో నివసిస్తున్న గుమ్మడి సృజన్%-%ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రిషివర్ధన్ (18) ఇటీవల డిప్లొమా పూర్తి చేసి బీటెక్ ప్రయత్నాల్లో ఉన్నాడు. వారం క్రితం అతని మొబైల్‌కు కేటుగాళ్లు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట పంపిన సందేశం చూసి ఆకర్షితుడయ్యాడు. తన తల్లి ఇటీవల మహిళా సంఘం నుంచి రూ. 90 వేల చిట్టీ పాడుకోవడంతో వచ్చిన డబ్బును ఇందుకోసం వాడుకోవాలనుకున్నాడు. వెంటనే ఆమె ఖాతాలోంచి ఆ సొమ్మును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. తొలుత రూ. 5 వేలను సైబర్ నేరగాళ్ల ఖాతాకు పంపాడు. అయితే రెట్టింపు సొమ్ము పొందాలంటే రెండో టాస్క్‌గా రూ. 23,500 పెట్టుబడి పెట్టాలంటూ వారు మెలిక పెట్టడంతో ఆ సొమ్మునూ చెల్లించాడు. మూడో టాస్క్‌లో రూ. 68 వేలు పెట్టుబడి పెడితే రీఫండ్ వస్తుందని కేటుగాళ్లు నమ్మించడంతో ఆ మొత్తం కూడా బదిలీ చేశాడు. అయితే ఆ సొమ్ముకు రెట్టింపు పొందాలంటే రూ. 2 లక్షల 6 వేలను బదిలీ చేయాలని వారు పేర్కొనడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు.

అంతకుముందు కుటుంబ సభ్యులకు లేఖ రాశాడు. 'సారీ మమ్మీ.. నేను చనిపోతున్నా, రిన్నూ (తమ్ముడు) జాగ్రత్త.. డాడీ, మమ్మీ ఇన్నీ రోజులు నన్ను భరించినందుకు థ్యాంక్స్. నేను ట్రేడింగ్ (స్టాక్ మార్కెట్)లో డబ్బులు పెట్టి మోసపోయా. కంపెనీ వివరాలు నా మొబైల్‌లో ఉన్నాయి' అంటూ లేఖలో పేర్కొన్నాడు.



## పులల సంచారంతో గ్రామీణ ప్రాంతంలో భయాందోళనలు

**నిర్మల్:** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని కాల్వ లక్ష్మీనర సింహ స్వామి ఆలయం సమీపంలో నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై వాహనదారులకు చిరుతపులి కనిపించింది. దీంతో తమ సెల్‌ఫోన్లలో చిరుతను బంధించారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి. కాగా, చిరుత సంచారంతో సమీపంలోని గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.



## మహనీయులను అవమానించడం కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే ఉంది : కేటీఆర్

**హైదరాబాద్:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ పర్యటనపై కేటీఆర్ మండిపడ్డారు. దేశం కోసం సర్వస్వం ధారపోసిన నేతలను అవమానపరిచే డీఎన్ఏ కాంగ్రెస్‌లోనే ఉందని అన్నారు. కాంగ్రెస్ అంటేనే మహనీయులను అవమానపరచడం అని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం మొత్తం విషాదంలో మునిగిపోయిన ఈ సమయంలో.. రాహుల్‌గాంధీ వియత్నాం పర్యటనకు వెళ్లడం ఆశ్చర్యకరంగా ఉందని కేటీఆర్ అన్నారు. గతంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ చేసిన అవమానాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని పేర్కొన్నారు. తమ పార్టీ, దేశం కోసం తమ జీవితాలను ధారపోసిన మహనీయులను అమానించడం కాంగ్రెస్‌కు అలవాటే అని విమర్శించారు.

## 'అలా ఎలా కూల్చేస్తారు?'.. హైడ్రాపై హైకోర్టు సీరియస్

,హైదరాబాద్ : హైడ్రా కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులు జారీ చేసి 24 గంటల సమయమే ఎలా ఇస్తారని ప్రశ్నించింది.హైదరాబాద్ ఖాజాగూడలో నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. ఈ కూల్చి వేతల్ని వ్యతిరేకిస్తూ బాధితులు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.విచారణ సందర్భంగా నోటీసులు జారీ చేసి బాధితుల వివరణ తీసుకోకుండా ఎలా కూల్చివేస్తారు. మీరు కూల్చేసిన నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ఎలా చెబుతున్నారు? సంబంధిత ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించింది. ఆధారాలన్నీ పిటిషనర్ వద్ద ఉన్నాయంటూ హైడ్రా తరుపు న్యాయవాది బదులు ఇచ్చారు. ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ పరిధి తేల్చకుండా అలా ఎలా కూల్చివేస్తారు. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మరోసారి హైడ్రా కమిషనర్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కోర్టుకు పిలిపించాల్సి వస్తుందని తెలంగాణ హైకోర్టు హెచ్చరికలు జారీ చేసింది.





# చిన్నషేర్లు.. పెద్ద లాభాలు

## 2024లో అత్యధిక లాభాలు పంచిన స్మాల్ స్టాక్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: చిన్న షేర్లు పెద్ద లాభాలు పంచాయి. ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెట్టినవారికి అత్యధిక రాబడిని పంచాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై నమ్మకం ఉండటంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎగబడి పెట్టుబడులు పెట్టడంతో సూచీలు రికార్డు స్థాయికి ఎగబాకాయి. బ్లూచిప్ సంస్థలతోపాటు చిన్న, చితక సంస్థల షేర్లు కదంతొక్కాయి. ఈ నెల 23 వరకు బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఏకంగా 12,144.15 పాయింట్లు లేదా 28.45 శాతం లాభపడింది. అలాగే మిడ్‌క్యాప్ ఇండెక్స్ కూడా 9,435.09 పాయింట్లు లేదా 25.61 శాతం ఎగబాకింది. కానీ, 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 6,299.91 పాయింట్లు లేదా 8.72 శాతం మాత్రమే పెరిగింది. ఈ నెల 12 ముగిసేనాటికి బీఎస్ఈ స్మాల్‌క్యాప్ చారిత్రక గరిష్ఠ స్థాయి 57,827.69కి చేరుకోగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 49,701.15కి చేరుకున్నది. ప్రాంతీయంగా ఉండే ఇన్వెస్టర్లు ఎక్కువశాతం చిన్న స్థాయి స్టాక్‌లను కొనుగోలు చేస్తుంటారు, అలాగే విదేశీ పెట్టుబడిదారులు బ్లూచిప్ సంస్థలు లేదా అతిపెద్ద సంస్థల్లో తమ పెట్టుబడులు పెడుతుంటారు. మిడ్‌క్యాప్ ఇండెక్స్ సరాసరి బ్లూచిప్ సంస్థల్లో ఐదోవంతుని, స్మాల్‌క్యాప్ సంస్థలు పదో వంతు కలిగివుండనున్నాయి. వచ్చే ఏడాదిలోనే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఇదే తరహాలో లాభాలు పంచే అవకాశాలున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. 'స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు మెరుగైన ప్రదర్శనగావించాయి. ఈ రంగాలు అత్యధిక వృద్ధి నమోదు చేసుకోవడం, అనుకూల మార్గదర్శకాలు, పెట్టుబడిదారులు ఆసక్తి చూపారు. రియల్ ఎస్టేట్, మౌలికం, హెల్త్‌కేర్, రెన్యూవబుల్ ఎనర్జీ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయి.

## స్పెషల్ ఫోటో షేర్ చేసిన మస్క్ - నెట్టింట్లో వైరల్

ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈఓ.. 'ఇలాన్ మస్క్' క్రిస్మస్ సందర్భంగా ఓ





ప్రత్యేకమైన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. నెట్టింట్లో వైరల్ అవుతున్న ఈ ఫోటో చూసిన నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఒజెంపిక్ శాంటా అంటూ శాంటా డ్రెస్‌తో.. క్రిస్మస్ చెట్టు ముందు నిలబడిన ఫోటోను మస్క్ షేర్ చేశారు. ఇందులో పెద్ద గడ్డం, నడుముపై చేతులు పెట్టుకున్న మస్క్‌ను చూడవచ్చు. ఇలాన్ మస్క్ శాంటా వేషధారణలో కనిపించడం ఇదే మొదటి సారి కాదు. ఎందుకంటే తన చిన్న తనం నుంచే శాంటా దుస్తులు ధరించిన ఫోటోలు కూడా ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇది ఎలా ప్రారంభమైంది.. ఎలా వెళుతోంది అంటూ మస్క్ మరో ట్వీట్ చేశారు. మేరీ క్రిస్మస్.. వండర్‌ఫుల్ న్యూ ఇయర్ అంటూ కూడా ట్వీట్ చేశారు.




# భారీగా బ్యాంకింగ్ మోసాలు..

## ప్రథమార్ధంలో 18,461 కేసులు

## రూ. 21,367 కోట్ల విలువ

## ఎనిమిది రెట్లు అప్

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో బ్యాంకింగ్ మోసాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దాదాపు రూ. 21,367 కోట్ల విలువ చేసే మొత్తానికి సంబంధించి 18,461 కేసులు నమోదయ్యాయి. విలువపరంగా చూస్తే మోసాల పరిమాణం ఏకంగా ఎనిమిది రెట్లు పెరిగింది. దేశీయంగా బ్యాంకింగ్ తీరుతెన్నుల గురించి రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఇందులో 2023%-%24 ఆర్థిక సంవత్సరం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రథమార్ధం వరకు ధోరణులను పొందుపర్చారు. దీని ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్%-%సెప్టెంబర్ మధ్య కాలంలో రూ. 21,367 కోట్ల మొత్తానికి సంబంధించి 18,461 కేసులు నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో రూ. 2,623 కోట్లకు సంబంధించి 14,480 కేసులు వచ్చాయి. వ్యాపారాలకు రిస్కులు మొదలుకుని కస్టమర్ల నమ్మకం దెబ్బతినడం వరకు ఈ మోసాల వల్ల వివిధ సవాళ్లు ఉంటున్నాయని నివేదిక పేర్కొంది. ఆర్థిక స్థిరత్వంపై వీటి ప్రభావం గణనీయంగా ఉంటుందని వివరించింది.


**నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..**

- దశాబ్దకాలంలోనే అత్యంత తక్కువగా 2023%-%24లో ఫ్రాడ్ కేసులు వచ్చాయి. సగటు విలువ 16 ఏళ్ల కనిష్ట స్థాయిలో నమోదైంది. ఇక ఇంటర్నెట్, కార్డ్ ఫ్రాడ్‌ల విషయానికొస్తే.. విలువపరంగా చూస్తే 44.7 శాతంగా ఉండగా, కేసులపరంగా చూసినప్పుడు 85.3 శాతంగా ఉంది.
- 2023%-%24లో మొత్తం ఫ్రాడ్ కేసుల్లో ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటా 67.1 శాతంగా ఉంది. అయితే, విలువపరంగా చూస్తే మాత్రం ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా అత్యధికంగా నమోదైంది. విదేశీ బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులు మినహా అన్ని నియంత్రిత సంస్థలపై విధించిన పెనాల్టీలు రెట్టింపై రూ. 86.1 కోట్లకు చేరాయి. సహకార బ్యాంకులపై జరిమానాల పరిమాణం తగ్గింది.
- బ్యాంకుల లాభదాయకత వరుసగా ఆరో ఏడాది 2023%-%24లోనూ మెరుగుపడింది. స్థూల మొండిబాకీలు 13 ఏళ్ల కనిష్టమైన 2.7 శాతానికి తగ్గాయి. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల నికర లాభం గత ఆర్థిక సంవత్సరం 32.8 శాతం పెరిగి రూ. 3,59,603 కోట్లకు చేరింది.

**ఏఐ వినియోగంపై ప్రత్యేక కమిటీ**

ఆర్థిక రంగంలో బాధ్యతాయుతంగా, నైతికంగా కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకునేందుకు విధానాల రూపకల్పన కోసం రిజర్వ్ బ్యాంక్ ఎనిమిది సభ్యులతో ప్రత్యేక కమిటీని ప్రకటించింది. దీనికి ఐఐటీ బాంబే ప్రొఫెసర్ పుష్పక్ భట్టాచార్య సారథ్యం వహిస్తారు. తొలి సమావేశం అనంతరం ఆరు నెలల వ్యవధిలో కమిటీ తన నివేదికను సమర్పిస్తుందని ఆర్‌బీఐ పేర్కొంది.

## ఫోన్ మారితే ఉబర్ ఛార్జ్ మారుతోంది - ఫోటోలు వైరల్




ఉబర్, ఓలా వంటి క్యాబ్ సర్వీసులు అందుబాటులోకి వచ్చిన తరువాత.. ఎక్కడికెళ్లాలన్నా వెహికల్ బుక్ చేసుకుని గమ్యాన్ని చేరుకుంటున్నాము. అయితే క్యాబ్ లేదా ఆటో ఛార్జీలు మాత్రం మనం బుక్ చేసుకోవడానికి ఉపయోగించే మొబైల్ ఫోన్లను బట్టి మారుతూ ఉంటాయి. ఇది వినడానికి కొంత ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది నిజం. దీనికి సంబంధించిన ఒక ట్వీట్, ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోను గమనిస్తే.. రెండు వేరువేరు మొబైల్ ఫోన్‌లలో రెండు వేర్వేరు ధరలను చూడవచ్చు. నిజానికి పికప్ పాయింట్, డ్రాపింగ్ పాయింట్ రెండూ ఒకటే. చేరుకోవడానికి పట్టే సమయం కూడా ఒకటే. కానీ ఆండ్రాయిడ్ ఫోన్‌లో బుక్ చేస్తే.. ఉబెర్ ఆటో రైడ్‌కు రూ. 290.79 చూపించింది. యాపిల్ ఐఫోన్‌లో అదే రైడ్‌కు రూ. 342.47 చూపించింది. దీనికి సంబంధించిన ఫోటోలు షేర్ చేస్తూ.. నా కుమార్తె ఆండ్రాయిడ్ ఫోన్‌లో కంటే.. నా యాపిల్ ఐఫోన్‌లో రైడ్ ధర ఎక్కువగా చూపిస్తోందని 'సుధీర్' అనే ఎక్స్ (%ఒషఛవతీ%) యూజర్ పేర్కొన్నాడు. బుక్ చేసుకునే టైమ్, దూరం, డిమాండ్ వంటి వాటిని బట్టి ధరలలో మార్పు ఉంటుంది. కానీ బుక్ చేసుకునే మొబైల్ ఫోన్‌ను బట్టి ఛార్జీలు ఉండవని ఉబర్ వెల్లడించింది.

## వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్‌లో 4000 ఉద్యోగాలు..



న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ సపోర్ట్, సర్వీసుల సంస్థ వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ తాజాగా భారత్‌లో గణనీయంగా నియామకాలు చేపట్టనుంది. కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వచ్చే 3%-%5 ఏళ్లలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 4,000 మంది పైగా లాంగ్వేజ్ నిపుణులను నియమించుకోనున్నట్లు సంస్థ వెల్లడించింది. చిన్న నగరాల్లో ఉద్యోగాల లభ్యతకు సంబంధించిన సవాళ్లను యువత అధిగమించడంలో తోడ్పాటు అందించే దిశగా రిక్రూట్‌మెంట్ తలపెట్టినట్లుగా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో గగన్ ఆరోరా తెలిపారు. ఇంగ్లీష్, ఫ్రెంచ్, కొరియన్ తదితర అంతర్జాతీయ భాషలతో పాటు కన్నడ, బెంగాలీ, గుజరాతీ తదితర ప్రాంతీయ భాషల్లోనూ సర్వీసులను అందిస్తున్నట్లు వివరించారు. వెర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ భారత్‌తో పాటు యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, నైజీరియా, నేపాల్, ఫిలిప్పీన్స్, యూఏఈలలో కార్యకలాపాలను కలిగి ఉంది. బిజినెస్ వర్టికల్స్‌లో వెర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్, వెర్టెక్స్ నెక్ట్స్, ఐఎల్‌సీ సొల్యూషన్స్, వెర్టెక్స్ లెర్నింగ్, వెర్టెక్స్ టెక్నాలజీస్ ఉన్నాయి.

# పాలనలోనూ కృత్రిమ మేధస్సు!


**21 ప్రభుత్వ విభాగాల్లో ఏఐ వినియోగానికి ఉన్న అవకాశాలపై మదింపు**

**ఐటీ శాఖ పరిధిలోని 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర సర్కారు**

**అంతర్జాతీయంగా పాలన రంగంలో ఏఐ వినియోగం తీరుపై అధ్యయనం**

**ప్రభుత్వ విభాగాల అవసరాలకు సరిపోయే రీతిలో ఏఐ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పన**

**పాలనలో ఏఐ వినియోగంపై ఉద్యోగులకు అవగాహన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు**




హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్%-% ఏఐ)ను మేళవించి ప్రజలకు త్వరితగతిన, సమర్థవంగా సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సమాచార సాంకేతిక (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ శాఖలు వెనుకంజలో ఉన్నాయనే విమర్శల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగానికి ఉన్న అవకాశాలపై కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంతో కూడిన అప్లికేషన్లు (యాప్‌లు) ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐటీ శాఖకు అనుబంధంగా ఉన్న 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు అప్పగించింది. సాంకేతికత వినియోగం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన విధానాల రూపకల్పనలో పేరొందిన 'జేపీఏఎల్'(జమీల్ పావర్టీ యాక్షన్ లాబ్) రాష్ట్ర పాలనలో ఏఐ వినియోగం విషయంలో ప్రభుత్వంతో జట్టుకట్టింది. ఇటీవల 21 ప్రభుత్వ శాఖలకు చెందిన 'ఏఐ నోడల్ ఆఫీసర్ల'తో వర్క్‌షాప్ నిర్వహించింది. ఆయా ప్రభుత్వ విభాగాల పరిధిలోని సంక్లిష్ట అంశాలకు ఏఐ ద్వారా ఏ తరహాలో పరిష్కారాలు సాధ్యమనే కోణంలో లోతుగా మదింపు చేశారు. అంతర్జాతీయంగా పాలన, ప్రజాసేవలో ఏఐ ప్రభావం, వినియోగం, వివిధ దేశాలు, రాష్ట్రాలు ఏఐని వినియోగిస్తున్న తీరుపై ఈ వర్క్‌షాప్‌లో నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు తగిన ఏఐ ఆధారిత యాప్‌లు, ఏ ప్రభుత్వ విభాగానికి ఏ తరహా యాప్‌లు అవసరమనే కోణంలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కసరత్తు చేస్తోంది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707